Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:6(3), June 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

# గంగమ్మ పూలు కథలు – వస్తు విలక్షణత

**శివమ్మ బాపన**
తెలుగు అధ్యాపకురాలు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాయచోటి,
అన్నమయ్య జిల్లా.
సెల్: 9581471476
మెయిల్: mshtelugu@gmail.com

**పరిచయం**:– డాక్టర్ వేంపల్లి గంగాధర్ కడప జిల్లాలోని వేంపల్లి గ్రామంలో1977 వ సంవత్సరంలో డిసెంబర్ 5 వ తేదీన జన్మించారు. రామ లక్షుమ్మ, గంగన్నలు వీరి తల్లిదండ్రులు. చిన్న వయసు నుండే రచనలు చేయడం ప్రారంభించారు. ఈయన కేవలం కథకుడు మాత్రమే కాదు నవలా రచయిత, విమర్శకుడు, పాత్రికేయుడు, చరిత్రకారుడు, ఉపాధ్యాయులకు కూడా. రాయలసీమకు సంబంధించిన పలు అంశాలపై రచనలు చేశారు. ప్రసిద్ధ సాహితీవేత్త సునీల్ గంగోపాధ్యాయ చేతుల మీదుగా తామ్ర పత్రం అందుకున్నారు. "రాయలసీమ కక్షల కథలు" అనే అంశంపై ఎం ఫిల్, "రాయలసీమ కథా సాహిత్యం" అనే అంశంపై పి.హెచ్.డి చేసి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి నుండి డాక్టర్ పట్టా పొందారు. వీరి మొదటి కథ సంకలనం మొలకల పున్నమి" కి కేంద్ర సాహిత్య అకాడమీ వారి మొదటి యువ పురస్కారం అందుకున్న తొలి తెలుగు రచయిత. కేంద్ర సాహిత్య అకాడమీ వారు మొదటిసారిగా లక్షద్వీప్ లో ఏర్పాటుచేసిన సాహిత్య కార్యక్రమానికి తెలుగు సాహితీవేత్తగా హాజరయ్యారు. విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్ర సాహిత్య అకాడమీ వారు ఏర్పాటుచేసిన "రైటర్స్ ట్రావెల్ గ్రాంట్" ప్రోగ్రామ్ ద్వారా 2011 ఏప్రిల్ 27 నుండి మే 7వ తేదీ వరకు శాంతినికేతన్లో పర్యటించారు. 2014 సెప్టెంబర్ 8వ తేదీ నుండి 26వ తేదీ వరకు రాష్ట్రపతి భవన్లో విడిది చేశారు. వీరి నవల "నేల దిగిన వాన" యోగివేమన విశ్వవిద్యాలయం, కడప ఎం.ఏ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ నూతనంగా రూపొందించిన ఒకటి నుండి ఆరవ తరగతి వరకు తెలుగు పాఠ్య పుస్తకాలకు మరియు పదవ తరగతి తెలుగు పాఠ్యపుస్తకానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.

**నేపథ్యం**:– ఒకనాటి రతనాలసీమ నేడు రాళ్ల సీమగా మారడానికి కారణం కరువు, కక్షలే కాదు అస్తవ్యస్తంగా మారిన సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలు కూడా. ప్రారంభంలో కరువు, కక్షల ఇతివృత్తాలతో కథలు రాసినా తర్వాత ఇతివృత్తాల ఎంపికలో ఇంతవరకు ఎవరూ స్వీకరించని అంశాలను కథా వస్తువులుగా స్వీకరించడం ప్రారంభించారు. ఈయన రచనల్లో ప్రధానంగా రాయలసీమలోని గ్రామీణ జీవితం, సామాజిక వాస్తవాలు, రైతుల కష్టాలు, కరువులు,

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:6(3), June 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

కక్షలు, స్థానిక సమస్యలు వంటి అంశాలు ప్రతిబింబిస్తాయి. అందుకే ఈయన కథలు తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక గుర్తింపు పొందాయని కచ్చితంగా చెప్పొచ్చు. ఈయన కథల నిండా మట్టి పరిమళాలు గుభాళిస్తాయని గుంటూరు శేషేంద్ర శర్మ గారు, సీమ జీవనాడి కథకుడని రామతీర్థ గారు, భైరాగిని ఇష్టపడే విశిష్ట కథకుడని మునిపల్లె రాజు గారు, రాయలసీమ ఇతిహాస రచయితని సింగమనేని నారాయణ గారు, కథ కథన శిల్ప చాతుర్యం పాత్ర చిత్రణ సామర్థ్యం పఠనీయ నిర్మాణ శైలి వంటి మంచి లక్షణాలున్న కథకుడని ఆచార్య రాచపాలెం  చంద్రశేఖర రెడ్డి గారు, వజ్రం లాంటి కథకుడని వాడ్రేవు చిన్న వీరభద్రుడు గారు డాక్టర్ వేంపల్లి గంగాధర్ గూర్చి ప్రశంసించారు. ఈయన వెలువరించిన ఆరవ కథా సంపుటి "గంగమ్మ పూలు". దీనిలో 15 కథలున్నాయి. అన్ని కథలూ రాయలసీమకు సంబంధించిన స్థానిక వస్తువుతో రచించినవే. కథల్లోని ఇతివృత్తాలు  స్థానికమైనవైనా పాత్రల బాధ, వేదన, జీవితం పట్ల ఆశ సంఘంలో గౌరవం కోసం పడే తపన మొదలైన అంశాల వల్ల ఈయన కథలు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్ళాయి. అందుకే వీరి రచనలు పలు భారతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి.

**తమిళ కూలి** :– తమిళనాడుకు చెందిన ఎర్రచందనం కూలీల జీవితాలను, వారు పోలీసుల చేతిలో పడే కష్టాలను ఇతివృత్తంగా తీసుకుని ఈ కథను రచించారు. నల్ల రాతి కొండ వద్ద ఎర్రచందనం కొట్టడానికి వచ్చిన కూలీలలో పోలీసులకు ఒక్కడు మాత్రమే పట్టుబడ్డాడు. మిగిలిన వారు పారిపోయారు. అతని పేరు శివలింగం. తమిళనాడుకు చెందిన వాడు. పూట గడవక పొట్టకూటి కోసం ఎర్రచందనం కూలీగా మారాడు. శివలింగం తన ఊర్లో ఆటో నడుపుకుంటూ భార్య, కూతురుతో  జీవించేవాడు. టింబర్ డిపోలో పనిచేసే మాణిక్యంతో పరిచయమైంది. అతడు ఎర్రచందనం చెట్లను కొట్టడానికి కావలసిన కూలీలను సప్లై చేసే ఏజెంట్. అంతర్జాతీయ మార్కెట్లో ఎర్రచందనానికి చాలా డిమాండ్ ఉంది. అందువల్లనే స్మగ్లర్లు తమిళనాడులో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా కూలీలను సమకూర్చుకుంటున్నారు. మాణిక్యం మాటలు విని ఇంకాస్త హాయిగా సంతోషంగా  జీవించవచ్చని ఆశ పడిన శివలింగం చివరికి జైలు పాలయ్యాడు. పోలీసులు బాగా కొట్టడం వలన ముఖమంత కమిలిపోయింది. కింది పెదవి పగిలి నెత్తుటి చారలు కనిపిస్తున్నాయి. " ఎక్కడి పక్షో మరెక్కడికో వలస వచ్చి బంధించబడినట్లున్నాడు" శివలింగం. పోలీసులు శివలింగాన్ని మీడియా ముందు ప్రవేశపెట్టి అతని వివరాలను చెప్పారు. విలేకరులు ఫోటోలు తీసుకున్నారు. అక్కడున్న వారిని ఆరోజు తేదీ ఏంటో తెలుసుకుని బోరున విలపించాడు శివలింగం. కారణం ఆ రోజు తన కూతురు పుట్టిన రోజు. పోలీసులు అడవుల్లో తనిఖీలు చేసినప్పుడల్లా పొట్టకూటి కోసం పనిచేసే కూలీలు దొరుకుతున్నారు కానీ ఏజెంట్లు స్మగ్లర్లు మాత్రం ఎక్కడో విదేశాల్లో ఉంటూ విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారు.

**తెల్ల దెయ్యం పూలు**:– ఏజెంట్ల మాటలు నమ్మి పల్లెల్లోని పేద రైతులు ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వ నిషేధిత గసగసాల పంటను సాగు చేసి రైతులు పడిన మానసిక సంఘర్షణ ఈ కథలోని ఇతివృత్తం. ఒకరోజు బెంగళూరు నుండి నలుగురు ఏజెంట్లు వచ్చి సర్పంచితో గసగసాల పంటసాగు గురించి వివరించారు. మరుసటి రోజు ఊళ్లోని నలుగురు రైతులను ఎంపిక చేసి గసగసాల పంటను సాగు చేసేలా నిర్ణయించారు. విత్తనాలు కూడా వాళ్లే ఇచ్చారు. ఏజెంట్లు పంటను గూర్చి వివరిస్తూ ఈ పంటకు తెల్ల పూలు పూస్తాయి. కాయలు కాస్తాయని చెప్పారు. కాయలకు ఘాటు పెట్టినప్పుడు పాలుకారి నల్లని జిగురుగా మారుతుంది. ఆ జిగురు వాళ్లకు ఇవ్వాలని తెలియజేశారు. అలాగే

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:6(3), June 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

కాయలు కోసిన తర్వాత కాయల తొక్క కూడా తప్పకుండా తమకే కావాలని చెప్పారు. రైతుల్లోని భయాన్ని గమనించిన ఓ ఏజెంట్ " భయపడాల్సిందేమీ లేదు. మీరు సాగు చేసేది కూడా పంటే. కాకుంటే కొంచెం పోలీసుల దృష్టిలో పడకుండా చూసుకోండి " అని చెప్పాడు. ఈ పంట సాగు చేయడం వలన తమ జీవితాల్లో వెలుగు వస్తుందని రైతులు భావించారు. రోజులు గడుస్తున్నాయి. కొత్తగా వచ్చిన ఎస్ఐ ఊర్లోని  రైతులందరినీ సమావేశపరిచి గసగసాల పంట సాగు చేయడం చట్ట విరుద్ధం కాబట్టి ఎవరైనా ఆ పంట వేస్తే కేసులు పెట్టి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. వెళుతూ వెళుతూ సర్పంచి తమ్ముడు సుబ్రహ్మణ్యంను పోలీస్ స్టేషనుకి తీసుకెళ్లారు. మరుసటి రోజు రామరాజును పట్టుకుపోయారు. జరిగేవన్నీ చూస్తూ ఉంటే గుర్రమ్మకు నిద్ర పట్టలేదు. తర్వాత జరగబోయేది తలుచుకొని భయపడింది. తెల్లవారగానే లేచి పొలానికి వెళ్లి ఒక్కో మొక్కను పీకి కుప్ప వేసి కాల్చివేసింది. పంట కాలిపోతూ ఉంటే గుర్రమ్మ గుండెల్లో బరువు, భయం తొలగిపోతూ ఉంది. భార్య చేసిన పనికి మునిరత్నం ఆమెను తిట్టిపోశాడు. కోపగించుకున్నాడు. అలిగాడు. కానీ గుర్రమ్మలో మాత్రం తమకు పట్టిన నరకం వదిలిపోయిందనే సంతోషం స్పష్టంగా కనిపిస్తోంది. ఎప్పుడు ఏమి జరుగుతుందో అనే భయంతో బతకడం కన్నా ఉన్నదానితో సంతోషంగా జీవించడమే మంచిదని అర్థం చేసుకుంది.

**మృగత్వం**:- అడవిలోని జంతువుల కన్నా సమాజంలోని మనిషి ప్రమాదకరమని ఇతివృత్తంతో ఈ కథ రచించారు. కోనప్ప అడవిలో తిరిగే ముంగిసల్ని, ఉడతల్ని పట్టుకొని చంపి వాటి లోపల అంతా శుభ్రం చేసి తిరిగి లోపల దూది, పొట్టు పెట్టి బొమ్మగా తయారు చేసి వచ్చి పోయే రైళ్లలో అమ్ముకునేవాడు. ఇదే అతని జీవన భృతి. అడవినే నమ్ముకుంటూ వచ్చాడు. ఆ అడవి అతన్ని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటూ వచ్చింది. ఎప్పుడు పస్తు పెట్టలేదు. తాను తయారు చేసిన బొమ్మలను రైలులో అమ్ముకోవడానికి వచ్చిన కోనప్పకు ఎదురుపడిన పోలీసులో టి.సి లో ఉండే వికృతమైన స్వభావాలను చూశాడు. అందుకే ఇలాంటి మనుషుల కన్నా అడవిలో క్రూర మృగాలే నయమని భావించాడు. జంతువులు ఆకలి వేస్తే మాత్రమే వేటాడుతాయి. కానీ మనుషులు స్వార్థంతో వెంటాడుతారు. ఒకసారి కోనప్ప తన తండ్రి సంజనప్పను  " అడవిలో నువ్వు ఒంటరిగా వెళ్తున్నప్పుడు దేన్ని చూస్తే భయపడతావు? అని అడిగినపుడు నేను దేనికి భయపడను. ఒక్క మనిషికి తప్ప!" అని చెప్పాడు. తాను పోలీసు, టి.సి వల్ల రైలులో పడిన కష్టాలను తలచుకుంటూ తో బాధతో గుడారానికి వచ్చేసరికి తన వాళ్ళందరినీ పోలీసులు తీసుకెళ్లారని తెలుసుకున్నాడు. తిరిగి అక్కడికి వెళ్లి చూస్తే పోలీసులు తన తమ్ముడిపై దొంగ కేసు పెట్టాలని చూస్తున్నారని కోనప్పకు అర్థమైంది. కాసేపటి తర్వాత పోలీసు అందరినీ లోపలికి పిలిచి ఇంకెప్పుడూ అడవి వైపు వెళ్లొద్దని హెచ్చరించి వదిలేశాడు. ఇంకెప్పుడూ తామెవరు అడవిలోకి అడుగు పెట్టకూడదని నిర్ణయించుకున్నారు. ఫ్యాక్టరీలో కూలిపనికో, కంకర మిషన్ దగ్గర పనికో, ఇటుక బట్టీ దగ్గర పనికో వెళ్ళి బతకాలని నిర్ణయించుకున్నారు. ఈ కథలో మృగత్వం అంటే జంతువులకు ఆపాదించింది కాదు. అది మనిషిలోని వ్యక్తిత్వాన్ని, స్వభావాన్ని ఉద్దేశించి చెప్పబడింది. ఎందుకంటే మనిషి కంటే మృగం ఇంకేమి ఉండదు కనుక..

**గరుడ పచ్చ** :- రంగు రాళ్లు ఏరుకొని ఏజెంట్లకు అమ్ముకొనే పేదవారి వ్యధ ఈ కథలోని ఇతివృత్తం. నల్ల రాతి

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:6(3), June 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

కొండపై నుండి కిందికి ఎటు చూసినా గులకరాళ్లు, మెట్టనేల కనిపిస్తుంది. నాలుగు చినుకులు కురిస్తే చాలు భూమి తల్లి పైన రంగురాళ్లు మెరుస్తూ కనిపిస్తాయి. అవి ఏరుకొని ఏజెంట్లకు ఇస్తే వారు అన్ని పరీక్షలు చేసి వందలకు కొని వేలకు, లక్షలకు, కోట్లకు అమ్ముకుంటూ వ్యాపారం చేసుకుంటారు. రంగురాయి దొరికితే చాలు జీవితం మారిపోతుందనుకునే పేద వారిలో కదిరప్ప కూడా ఒకడు. మొన్న కురిసిన వానకు కదిరప్పకు గరుడ పచ్చ రాయి దొరికిందని పల్లెలోని వారంతా అనుకుంటున్నారు. కానీ ఈ విషయాన్ని కదిరప్ప ఒప్పుకోవడం లేదు. ఏజెంట్లు అడిగినారు… తనకు దొరకలేదని చెప్పాడు. ఒకరోజు పోలీసులు వచ్చి స్టేషనుకు తీసుకెళ్లి గరుడ పచ్చ రాయి దొరికిందా? అని ఆరా తీశారు. తనకు దొరకలేదని చెప్పాడు. పోలీసులు బాగా కొట్టడంతో ఒళ్లంతా వాచిపోయింది. ఉదయం కదిరప్ప భార్య లక్ష్మమ్మ భర్త పరిస్థితి చూసి తట్టుకోలేకపోయింది. వెంటనే ఇంటికి పరుగు తీసింది. జొన్నల మూట విప్పి నట్టింట్లో పోసింది. వాటి మధ్యలో నుండి పిడికెడంత పచ్చ రాయి తీసుకొని చీర కొంగులో ముడి వేసుకొని పోలీస్ స్టేషనుకు వెళ్లి టేబుల్ పైన పెట్టేసింది. అప్పటికే అక్కడకు ఎంఆర్ఓ, ఏజెంటు వచ్చి ఉన్నారు. పచ్చరాయిని చూడగానే వాళ్ల కళ్ళు మెరిసాయి. పోలీసులు కదిరప్పను ఇంటికి పంపించేశారు. లక్ష్మమ్మ చేసిన పనికి కదిరప్ప భార్యను బాగా తిట్టాడు. కోపగించుకున్నాడు. అలిగి జ్వరానికి మాత్ర కూడా వేసుకోకుండా ఉన్నాడు. కానీ లక్ష్మమ్మ మనసుకు మాత్రం ప్రశాంతంగా ఉంది. గరుడపచ్చరాయి కన్నా తనకు బర్తే ముఖ్యమనే విషయం ఎలా చెప్పాలో ఆమెకు అర్థం కావడం లేదు. గరుడప్ప ఎప్పటికీ అర్థం చేసుకుంటాడో కూడా ఆమెకు తెలియదు. గరుడపచ్చరాయి దొరికినప్పుడు ఆమెకు జీవితం మారుతుందనే ఆశ కలిగినా భర్త కోసం ఆశను వదులుకుంది. ఆ రాయిని సొంతం చేసుకున్న పోలీసు, ఎమ్మార్వో,ఏజెంట్ కొత్త కార్లు కొనబోతున్నారు. కానీ లక్ష్మమ్మ మాత్రం ఎప్పటిలాగే కూలీ పనికి వెళుతోంది.

**కాలముఖం** :– తాగుడుకి బానిసైన కొందరు రైతులు పొలాల్లో బిగించుకున్న ట్రాన్స్ఫార్మర్లు పగలగొట్టి అందులోని రాగి తీగలు ఆయిల్ దొంగతనం చేయడం వల్ల రైతులు పడే కష్టాలే ఈ కథలోని ఇతివృత్తం. ఈ మధ్యకాలంలో చుట్టుపక్కల పల్లెలో రైతులు పొలాల్లో బిగించుకున్న ట్రాన్స్ఫార్మర్ల దొంగతనాలు ఎక్కువ అయ్యాయి. శివ నాగులు అరటి తోట వేశాడు. ఆకులు రాసుకొని గెలలు బాగా దెబ్బతింటున్నాయి. వాటిని తొలగించాలని నరసింహులు తోడు తీసుకుని తోటకు వెళ్లాడు. అక్కడ తాను నీటి కోసం బిగించుకున్న ట్రాన్స్ఫార్మర్ను ఎవరో పగలు కొట్టారు. ఈ సమయంలో పంటకు నీళ్లు అందకపోతే పంట చేతికందని ఎంతో బాధపడ్డాడు. ఇలాగే ఇంకొందరు ట్రాన్స్ఫార్మర్లు పగలగొట్టి దొంగతనం చేశారని తెలుసుకున్నాడు. అందరూ కలిసి పోలీస్ స్టేషన్కు వెళ్లి కంప్లైంట్ ఇచ్చారు. శివనాగులకు కళ్ళ ముందు తన అరటి తోటే కనిపిస్తోంది. కొత్త ట్రాన్స్ఫార్మర్ బిగించుకోవాలంటే ఇప్పటికిప్పుడు కుదరదు. అంత డబ్బు ఖర్చు పెట్టుకునే స్థితిలో లేడు. నాలుగు రోజుల తర్వాత పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. బండల పాలిషింగ్ ఫ్యాక్టరీలో పనిచేసే వీళ్ళు తాగుడికి బానిసలై ఇలాంటి దొంగతనాలు చేస్తున్నామని చెప్పారు. ఇంకా ఒక లైన్మెన్ ఆటో నడుపుకునే వాడు కూడా ఈ దొంగతనాలు చేస్తున్నారని తెలిసింది. కాకపోతే వాళ్లు చెర్లోపల్లి పొలాల్లో మాత్రమే దొంగతనాలు చేశామని చెప్పారు. దొంగలు దొరికారని తెలియగానే చిన్న ఆశ చిగురించిన శివనాగులు ఇక చేసేదేమీ లేక పాత అప్పు అలాగే ఉండగానే మళ్ళీ ఐదు రూపాయల వడ్డీకి కొత్త అప్పు చేయాలని చిన్నారెడ్డి ఇంటివైపు అడుగులు వేస్తున్నాడు.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:6(3), June 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

**మయూర ఖేదం** :– పేదల ఆర్థిక నిస్సహాయతను, వారి ఆశలను ఆసరాగా తీసుకొని ఆడపిల్లల్ని కొనుక్కుని వారిని వ్యభిచార వృత్తిలోకి ఎలా పంపిస్తున్నారనే అంశమే ఈ కథలోని ఇతివృత్తం. నాగమణి పేరుకు తగినట్లుగానే భారీ ఆకారం. ఒంటి మీద నగలతో పెద్ద ధనవంతురాలు అన్నట్లు కనిపిస్తుంది. ఆమెను చూసిన, మాట్లాడిన వాళ్ళకి ఆమెలా బతకాలనిపిస్తుంది. ఆమె వెంట ఒక్క ఆడపిల్లని పంపితే ఇక్కడ తాము సంతోషంగా బతకొచ్చని ఆశపడిన కొందరు డబ్బుకు ఆశపడి తమ ఆడపిల్లల్ని ఆమెతో పంపించేవారు. అలా తన వెంట తీసుకెళ్లే ఆడపిల్లలను మహారాష్ట్రలోని బివాండి వ్యభిచార కేంద్రానికి తీసుకెళ్ళేది. ఇదే ఆమె చేసే వ్యాపారం. ఇప్పుడు నాగారప్పమ్మ జాతర కోసం వచ్చింది. ఇక్కడికి రావడానికి కేవలం భక్తి ఒకటే కారణం కాదు. ఈసారి తనతో పాటు వెంకటలక్ష్మి, మునెమ్మ, ఇమాంబి, దమయంతి అనే నలుగురు అమ్మాయిల్ని తీసుకువెళ్లడానికి అగ్రిమెంటు చేసుకుంది. దమయంతి జాతర్లలో రికార్డింగ్ డాన్సులు చేసుకుంటూ ఉండేది. ఇప్పుడు ఇలా నాగమణితో కలిసి దాదర్ ఎక్స్ ప్రెస్ లో మహారాష్ట్ర వైపు వెళుతోంది. కిటికీ పక్కన కూర్చుని అప్పుడప్పుడు బయటకి చూస్తూ సెల్ ఫోన్ లో గేమ్స్ ఆడుకుంటూ ఉంది. ఇంతలో చార్జింగ్ అయిపోయింది. సెల్ కి చార్జింగ్ పెడుతూ ఉండగా ఇమాంబి వచ్చి పక్కన కూర్చుంది. తనకు ఎప్పటికైనా సినిమాల్లో నటించాలనే ఆశ ఉందని, కానీ పేదరికం వల్ల తనను నాగమణికి అమ్మేశారని చెప్పింది. తమ్ముడిని టౌనులో చదివించడం కోసం మా నాన్న నన్ను నాగమణికి అమ్మేశాడని మునెమ్మ బాధపడింది. నాలుగేళ్లుగా రికార్డింగ్ డాన్సుల వాళ్లతో పనిచేస్తున్నాను, కానీ ఇప్పుడు నాగమణికి అమ్మేశారని వెంకటలక్ష్మి చెప్పింది. అందరి మాటలు విన్న దమయంతికి వారెవరికి నాగమణితో కలిసి వెళ్లడం ఇష్టం లేదని అర్థమైంది. ముఖం కడుక్కొని ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లి పోలీసులకు ఫోన్ చేసింది దమయంతి. గుంతకల్ స్టేషన్ రాగానే పోలీసులు వచ్చి నాగమణిని అరెస్టు చేసి ఆమె దగ్గర ఉన్న అగ్రిమెంట్లు అన్ని చూసి కేసు పెట్టి లాకప్ లో వేశారు. బివాండికి కూడా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. జరిగిందేమిటో అర్థం కాని మిగిలినవారు సెల్ఫోన్లో గేమ్ ఆడుతున్న దమయంతి వైపు చూశారు. ఈ రోజుల్లో " ఆడపిల్లలకు వంద రూపాయలకు ఎన్ని పది రూపాయల నోట్లు వస్తాయో తెలియకపోయినా పర్లేదు. మీ ఇంట్లో వాళ్ల ఫోన్ నంబర్లేవీ తెలియకపోయినా పర్లేదు. చివరికి మీ పేర్లు మీకు గుర్తు లేకపోయినా పర్లేదు. కానీ 100 నంబర్ కు ఫోన్ చేయడం వచ్చి ఉంటే చాలు" అని దమయంతి ధైర్యంగా చెప్పింది. వారందరినీ పోలీసులు వారిళ్లకు సురక్షితంగా పంపించే ఏర్పాట్లు చేశారు.

**నీలి కళ్ళ పిల్ల**:– ఏ పరిచయం ఎందుకు ఏర్పడుతుందో ఎవరూ కచ్చితంగా చెప్పలేరు. అలా రచయితకు ఓ చిన్ని నీలి కళ్ళ పిల్లతో ఏర్పడిన పరిచయమే ఈ కథలోని ఇతివృత్తం. రచయిత ఉపాధ్యాయుడు. బడికి దగ్గరలో ప్రతి గురువారం సంత జరుగుతుంది. ప్రతీ వారం సంతకు వెళ్లాల్సిన అవసరం రచయితకు లేదు కానీ ఈమధ్య ఎక్కువగా వెళుతున్నాడు. అందుకు కారణం సంతలో ఓ చిన్ని నీలి కళ్ళ పిల్లతో ఏర్పడిన పరిచయం. ఆ కళ్ళు రచయితను బాగా ఆకర్షించాయి. ఆ పాప పేరు అఖిల. సంతలో ఎండు చేపలు అమ్ముకునే దుర్గమ్మ కూతురు. ఆమె భర్త వెంకటరాముడు తాగుబోతు, తిరుగుబోతు. సంతలేని రోజు దుర్గమ్మ కూలీకి వెళుతుంది. సంతలో రచయితను కలిసిన ప్రతి సారి కూతురుకున్న నీలి కళ్ళ గురించి చెప్పి బాధపడుతూనే ఉండేది. అలాంటి కళ్ళు ఉండటం కొందరు అదృష్టం అంటే మరికొందరు అరిష్టమంటున్నారు. మిగిలిన పిల్లలు కూడా కూతురుతో ఆడుకోవడానికి ఇష్టపడరని చెప్పి కన్నీళ్లు పెట్టుకునేది. ఒకరోజు రచయిత తన స్నేహితుడైన కంటి డాక్టర్ కి ఫోన్ చేసి నీలి కళ్ళ గూర్చి వివరాలు అడిగాడు.


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:6(3), June 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

అప్పుడు ఆ డాక్టర్ అది జబ్బు కాదని, భయపడాల్సిన అవసరం లేదని, కేవలం జన్యుపరంగా మాత్రమే వస్తుందని చెప్పాడు. ఆ మాటలు విన్న రచయితకు ఎంతో ప్రశాంతంగా అనిపించింది. ఈ విషయాన్ని దుర్గమ్మకు చెప్పడం కోసం గురువారం సంతోషంగా సంతకు వెళ్లాడు. కానీ అక్కడ ఎండు చేపల అంగడి ఉంది కానీ దుర్గమ్మ, అఖిల లేరు. వాళ్లను ఆమె భర్త కొట్టి తరిమేశాడని చెప్పడంతో కళ్ళ ముందు నీలి కళ్ళ పిల్ల రూపమే కదలాడుతుండగా సంత బోసి పోయినట్లు అనిపించింది. తల్లీ కూతుర్లు కనపడని ఆసంతలో ఉండలేక వెనక్కి వచ్చేశాడు.

**బైరాగుల బండి** :- ఒకప్పటి బొగ్గు ఇంజన్ రైలు బండి ప్రయాణమే ఈ కథలోని ఇతివృత్తం. ఆ రైలు అసలు పేరు లోకల్. కానీ అందులో ఎక్కడ చూసినా సాధువులు, సన్యాసులు, బైరాగులు ఎక్కువగా కనిపించడం వలన దాన్ని అందరూ "బైరాగుల బండి" అని పిలిచేవారు. తంబుర మీటుతూ ఏవేవో జీవిత సత్యాలను తత్వాలుగా పాడుతూ ఉండేవారు. ఒకసారి బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలు,మరోసారి సిద్దయ్య పలుకులు పాడేవారు. తిరుమల దర్శనం చేసుకుని వచ్చేవాళ్లు గోవింద నామాలు పలుకుతూ ఉండేవారు. వాళ్ల దగ్గరున్న లడ్డు వాసన గుప్పుమంటూ వస్తుండేది. ఎక్కడపడితే అక్కడ చిన్న చిన్న స్టేషన్లో కూడా గంటకు పైగా రైలు ఆపేసేవారు. రైలులో పక్కనున్న వారితోనే కాదు, భోగిలలో ఉండే వాళ్ళందరితో పరిచయాలయ్యేవి. స్నేహితులయ్యే వాళ్ళు. బంధువులయ్యేవాళ్ళు. స్టేషన్లలో రైలు ఆగినప్పుడల్లా మర చెంబుతో నీళ్లు పట్టుకోవడం పిల్లలకు ఎంతో ఇష్టం. అలా ఒక స్టేషన్లో రైలు ఆగినప్పుడు ఉన్నట్లుండి ఒకతను వేరుశెనక్కాయలున్న గంపతో రైలెక్కాడు. అన్ని బోగీలు తిరుగుతూ అమ్ముకుంటున్నాడు. రెండు స్టేషన్ల తర్వాత రచయిత అతని దగ్గరికి వెళ్ళాడు. అడుగున కొన్ని కాయలు మాత్రమే ఉన్నాయి. కానీ అతను పదే పదే తన కాలివైపు చూసుకుంటున్నాడు. ఏమైందని రచయిత అతన్ని అభిమానంగా అడిగాడు. అయ్యో అలాగా అంటూ రచయిత జాలిపడి ఆయనకి కొన్ని జాగ్రత్తలు చెప్పాడు. ఆ అభిమానానికి అతడు ఎంతో సంతోషపడ్డాడు. గంపలు అడుగున మిగిలిన శనక్కాయలు పొట్లం కట్టి రచయితికి ఇచ్చి డబ్బు తీసుకోకుండా వెళ్ళిపోయాడు. అప్పట్లో రైళ్లు కేవలం రవాణా సాధనాలు మాత్రమే కాదు. అవి భిన్నమైన సామాజిక,ఆర్థిక పరిస్థితుల నుండి వచ్చిన వ్యక్తులను ఒకచోట చేర్చే సామాజిక సాధనాలుగా కూడా పని చేశాయని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

**గజ్జల పిల్లోడు**:- బిడ్డ భవిష్యత్తు బాగుండాలని కోరుకునే ఓ తల్లి వేదనే గజ్జల పిల్లోడు కథలోని ఇతివృతం. నరసింహప్ప, తులసమ్మల కొడుకు దాసప్ప. నరసింహప్ప బ్యాండ్ మేళం బృందంలో పనిచేస్తుంటాడు. తులసమ్మకు కొడుకుని బాగా చదివించుకోవాలని కోరిక. దాసప్ప కూడా బాగా చదువుతూ ఉంటాడు. ఒకరోజు నరసింహప్ప కొడుకు చదువుకునే బడికి వెళ్లి వాడిని కూడా బ్యాండు మేళం బృందంలో పనిచేయడానికి తీసుకువెళ్తాడు. కార్యక్రమం పూర్తిచేసుకుని తిరిగి ఇంటికి చేరిన దాసుని చూడగానే తల్లి కోపంతో కొడుతుంది. పిల్లవాడి చేతులు చూసి కన్నీరు పెట్టుకుంటుంది. భర్త నిద్ర లేచాక పిల్లాడిని పనికి ఎందుకు తీసుకు వెళ్ళావని నిలదీస్తుంది. ఇంకెప్పుడు పిల్లోడిని గజ్జల పనికి తీసుకువెళ్లొద్దని ఒట్టు వేయించుకుంటుంది. కొద్ది రోజుల తర్వాత మళ్లీ దాసుని వాళ్ళ నాన్న గజ్జల పనికి తీసుకెళ్లాడని తెలుస్తుంది. వెంటనే పని ఎక్కడో తెలుసుకొని అక్కడకు చేరుకుని చేతుల్లోకి మట్టి తీసుకొని భర్త పైకి విసిరేస్తుంది. నానా తిట్లు తిడుతుంది. దాసు చేతుల్లోని గజ్జలు తీసుకొని కోపంతో నేలకేసి కొట్టింది. చెయ్యి పట్టుకొని కొడుకుని బడివైపుకు లాక్కెళ్ళింది. ఆమె బాధను అర్థం చేసుకున్న నరసింహప్ప తన కొడుకుని బాగా చదివించుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. బడి నుంచి తిరిగి గుడి దగ్గరకు చేరుకున్న తులసమ్మ దూరంగా పడి


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:6(3), June 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

ఉన్న గజ్జలను తన చేతుల్లోకి తీసుకొని ఇకనుండి ఆ పని తాను చేయాలని నిర్ణయించుకుంటుంది.

**బొగ్గుల మనిషి**:- బొగ్గుల బట్టి వ్యాపారం చేసే వారి జీవితంలోని కష్టాలను ఇతివృత్తంగా తీసుకొని ఈ కథ రచించారు. ఒకప్పుడు బొగ్గులు బట్టి వృత్తికి ఎలాంటి ప్రభుత్వ అనుమతి అవసరం లేదు. ఇప్పుడు కొత్తగా ప్రభుత్వ విధానాలలో వచ్చిన మార్పు వలన ఈ వృత్తికి కూడా ప్రభుత్వ అనుమతి ఉండాలి. బొగ్గుల బట్టీలు రెండు వేయడానికి ముందే అవసరం కోసం డబ్బు తీసుకొని కాంట్రాక్టర్ కి అమ్మేశాడు. ఇంకా రెండు బట్టీలు వేయాల్సి ఉంది. పరిస్థితి ముందులాగా లేదు కాబట్టి భయపడుతూనే ఉన్నాడు. ఈసారి మాత్రం ఎవరి దగ్గర అడ్వాన్స్ తీసుకోకుండా బట్టీలు వేయాలనుకున్నాడు బొగ్గుల మనిషి. అవి అమ్మగా వచ్చిన డబ్బుతో కూతురి పెళ్లి చేయాలనుకుంటాడు. బస్తా బొగ్గులు కాంట్రాక్టర్ కి అమ్మితే 300 రూపాయలు ఇస్తాడు. అదే మార్కెట్లో అమ్మితే 500 రూపాయలు వస్తాయి. ఈసారి ఎలాగైనా 30 బస్తాల బొగ్గు  తీయాలనుకున్నాడు. కూలీలు వచ్చారు బట్టీలో పనిచేసే రామాంజినే బొగ్గుల బట్టీలు వేశాడు. రెండు రోజుల్లో కాంట్రాక్టర్ వచ్చి వాటిని తీసుకెళతాడనగా ఒక రోజు ఉదయం ఫారెస్ట్ అధికారులు ట్రాక్టర్, కూలీలతో సహా వచ్చారు. విషయం అర్థమైన బొగ్గుల మనిషి "సార్ సార్ అవన్నీ కాంట్రాక్టర్కు అమ్మేసిన బొగ్గులు. మీరు తీసుకుపోతే నేను చేతి నుంచి వాళ్లకు డబ్బులు వెనక్కి కట్టాలి. ఇంక బట్టీలు వెయ్యను. మా అమ్మ మీద ఒట్టు సార్" అని బతిమాలుకున్న వాళ్ళు వినకుండా బుగ్గంతా తీసుకెళ్లారు. ఇప్పుడు దాన్ని విడిపించుకోవడానికి ఫారెస్ట్ వాళ్ళ చుట్టూ తిరగాలని బాధపడుతూ కూర్చున్నాడు. ఈలోగా మళ్లీ ఇస్త్రీ చేసే వెంకటేష్ కొడుకుల బొగ్గుల కోసం వచ్చాడు. బొగ్గులు లేవని చెప్పాడు. వాడు భట్టి దగ్గర అక్కడక్కడ పడి ఉన్న చిన్న చిన్న బొగ్గులు ఏరుకొని కవర్లో వేసుకొని కొంత చిల్లర బొగ్గులు మనిషి చేతిలో పెట్టి కొంత దూరం వెళ్ళాడు. ఎదురుగా బైకులో వస్తున్న కాంట్రాక్టర్ పిల్లాడిని అరిచి బొగ్గులు లాక్కున్నాడు. ఇదంతా చూస్తున్న బొగ్గుల మనిషి సంచి బుక్కులు పోతేనే ఇలా ఉన్నాడు. మొత్తం ఫారెస్ట్ వాళ్ళు తీసుకెళ్లారంటే ఏమంటారు అని ఆలోచించుకుంటూ కూర్చున్నాడు. ఇకపై ఈ వృత్తి మానేయాలని ఏదైనా కొత్త పని వెతుక్కోవాలని నిర్ణయించుకున్నాడు.

**జమీందారీ బంగ్లా** :- జమీందారుల జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఈ కథ రచించబడింది. బంగ్లా లోపలికి అడుగుపెడుతూనే గోడల పైన ఎదురుగా పులితల, చర్మము బిగించబడి ఉన్నాయి. గోడలపై ఏనుగు దంతాలు, ఒంపులు తిరిగిన జింక కొమ్ములు, నాటు తుపాకులు గోడకు హుందాగా అమర్చి ఉన్నాయి. కొయ్య సింహాసనం, వీర ఖడ్గం, ముత్యాల పట్టుకుచ్చుల తలపాగా, పులిగోరు హారం, మెరిసేటి విదేశీ పట్టు వస్త్రాలు, ఆభరణాలు, మెత్తటి మేజోళ్ళు, పరిమళాల అత్తర్లు, పూలాభిషేకాలు.... ఒక్కటేమిటి? చూడడానికి రెండు కళ్ళు చాలవు. జమీందారీ బంగ్లా అంత అందంగా ఉంటుంది. బంగ్లాలోకి ఎవరొచ్చినా మంచి ఆతిథ్యం ఇచ్చేవారు. బాటసారుల కోసం సత్రాలు కట్టించారు. గ్రామ ప్రజల కోసం చెరువులు, బావులు, తవ్వించారు. నిరుపేదలకు, నిర్భాగ్యులకు అవసరమైన సహాయం అందించేవారు. జమీందారు సంస్థానంలో కన్నా బయటే ఎక్కువ సమయం గడిపేవారు. తండ్రి గారిపై ఉన్న గౌరవంతో తండ్రి గారి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని తయారు చేయించి ప్రవేశద్వారం దగ్గర ప్రతిష్ఠించాలని ఏర్పాట్లు చేయిస్తున్నారు. ఇలా జమీందారీ నీడలో ప్రజల జీవితాలు హాయిగా గడిచిపోతూ ఉండగా గ్రామాల్లో మసూచి

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:6(3), June 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

సోకింది. కరువు వచ్చింది. అందరి ఆకలి తీరుస్తూ ప్రజలకు చేతనైనంత సాయం అందిస్తూ జమీందారు ప్రజలను జాగ్రత్తగా చూసుకుంటున్నారు. చివరికి దివాణం దివాలా తీసింది. ఖజానా ఖాళీ అయింది. అందరూ దివాణం గురించి జమీందారు గురించి అనుకునే మాటలు జమీందారు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. బాగా ఆలోచించి జమీందారు ఒక నిర్ణయానికి వచ్చారు గదిలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుని మరణించారు.

**ఒంటి కాలి కాకి** :– శరీరంలో ఒక అవయవం లేకపోయినా జీవన పయనం ధైర్యంగా సాగించాలనేది ఈ కథలోని ఇతివృత్తం. ఈమధ్య బడిలో ఒంటికాలితో ఒక కాకి తిరుగుతుందని చాలా మంది పిల్లలు రచయితకు చెప్పారు. రచయిత ఆ కాకిని చూడాలని ఎన్నోసార్లు ప్రయత్నించినా ఆయనకు మాత్రం కనిపించడం లేదు. రచయిత ఆ కాకికి ఒక కాలు ఎలా పోయిందో అన్న ఆలోచన కన్నా, ఒక కాలుతో ఆ కాకి ఎలా జీవిస్తుందో చూడాలనుకున్నాడు. మధ్యాహ్నం పిల్లలందరూ భోజనం చేసిన తర్వాత ప్లేట్లు కడుక్కునే చోట ఆ కాకి తిరుగుతూ ఉందని తెలిసింది. వెంటనే రచయిత అక్కడికి చేరుకున్నాడు. దూరంగా వేప చెట్టు కొమ్మలు గాలికి ఊగుతున్నాయి. చెట్టు కింద నీడలో కాకి కనిపిస్తుంది. అటు ఇటు తిరుగుతూ ఏదో తింటోంది. ఇంకా దగ్గర నుంచి చూడాలనిపించి చిన్నగా ముందుకు నడుచుకుంటూ వెళ్లాడు. అవును ఆ కాకికి ఒక కాలే ఉంది. తన శరీర బరువునంతా ఒక కాలిపైనే మోస్తోంది. ఇలా ఒకరోజు కాదు జీవితం అంతా బతకాలి అని ఆలోచించినప్పుడు రచయిత మనసుకు బాధగా అనిపించింది. కానీ కాకి కళ్ళలో ఎక్కడ తనకు ఒక కాలే ఉందన్న భావన లేదు. తన ఆహారాన్ని తానే సంపాదించు కుంటూ చాలా ఆనందంగా ఉంది. ఎగురుతూ ఎగురుతూ ఎండిన మంచి పుల్లలను ఏరుకుని తన గూడుని కట్టుకుంటోంది. అది ఒళ్లంతా నల్లరంగుతో కావ్ ... కావ్ అని అరుస్తుంటే ఏవి శాశ్వతం కాదని, ఈ జీవితాన్ని ఇట్లా గడపడమే పరమార్థమని చెబుతున్నట్లే అనిపించి రచయిత అలాగే చూస్తుండి పోయాడు.

**జెయింట్ వీల్** :–చిన్నతనంలో తన వద్ద డబ్బులేక పొందలేని ఆనందాలను పెద్దయ్యాక ఇతరులకు ఆ ఆనందాలను అందించి సంతోషపడే ఉన్నత వ్యక్తిత్వం కలిగిన ఒక వ్యక్తి జీవితమే ఈ కథలోని ఇతివృత్తం. రచయిత వాళ్ళ ఊరిలో జాతరకు, తిరునాళ్లకు, ఉరుసుకు ఒకరోజు ముందే రంగులరాట్నం వచ్చేది. దాన్ని బిగించేటప్పుడే బడిలో పిల్లలందరికీ తెలిసిపోయేది. ఆ తర్వాత సమయమంతా పిల్లలు అక్కడే గడిపేసేవాళ్ళు. రంగులరాట్నం ఎక్కడం అంటే రచయితకు కూడా చాలా ఇష్టం. కాలంతో పాటు అన్నీ మారినట్లు రంగులరాట్నం స్థానంలో జెయింట్ వీల్ వచ్చింది. రచయిత ఊర్లోకి ఎగ్జిబిషన్ వచ్చింది. రెండు రోజుల తర్వాత రచయిత తన స్నేహితుడు నాగరాజుతో కలిసి ఎగ్జిబిషన్ కు వెళ్ళాడు. ఎడమ గేటు వైపు జెయింట్ వీల్ ఉంది. కుడి వైపు గేటు వద్ద ఒక సన్నటి పొడవాటి వ్యక్తి దగ్గరకు పిల్లలంతా పరిగెత్తుకొని వచ్చి చుట్టుముడుతున్నారు. అతను తన చేతిలోని టికెట్లను పిల్లలకు ఒక్కొక్కరికి రెండు టికెట్లు ఇస్తున్నాడు. ఒకటి ఎగ్జిబిషన్ లోపలికి వెళ్లడానికి, ఇంకోటి జెయింట్ వీల్ ఎక్కడానికి. పిల్లలందరూ ఆనందంగా అతనికి షేక్ హ్యాండ్ ఇచ్చి కేరింతలు కొడుతూ లోపలికి పరిగెడుతున్న వాళ్లను చూసి అతడు ఎంతో సంతృప్తిని పొందుతున్నాడు. "ఆ వ్యక్తి ఊరి బయట ఉన్న ఆటోనగర్లో మెకానిక్ గా పనిచేస్తున్నాడు. తన చిన్నప్పుడు డబ్బు లేక ఎగ్జిబిషన్ బయటే నిలబడి చూసేవాడని, తనలాగా పిల్లలు ఎవరూ బాధపడకూడదని ఇప్పుడు ఈ విధంగా

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:6(3), June 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

చేస్తున్నాడని "అక్కడి వారందరూ చెప్పుకుంటున్నారు. అందరి దృష్టిలో ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని కలిగిన అతను రచయితకి మాత్రం జైంట్ వీల్ కన్నా ఎత్తయిన, ఉన్నతమైన వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపించడంతో రచయిత అలాగే అతన్ని చూస్తుండిపోయాడు. ఇలాంటి వ్యక్తిత్వం కలిగిన వాళ్ళు నేటి సమాజంలోచాలా అరుదుగా కనిపిస్తుంటారు.

**సహదేవుడి వేణువు**:- కళాకారుడి గొప్పతనం అతడు ఉపయోగించే వాయిద్యంలో కాదు అతను చేసే సాధనలో ఉంటుందనేది ఈ కథలోని ఇతివృత్తం. పాండవుల పాత్రలతో అల్లిన కథ ఇది. పాండవులు అరణ్యవాసం అజ్ఞాతవాస కాలంలో విరాట రాజు కొలువులో మారు వేషాలు వేసుకొని పేర్లు మార్చుకొని జీవిస్తున్నారు. ఒకనాడు అంతఃపుర స్త్రీలంతా బృహన్నల వద్దకు వచ్చి తమకు వేణువు వాయించడం నేర్పించమని అడిగారు. అది తనకు చేతకాదని ఎంత చెప్పినా వారు వినడంలేదు. వేణువు తెచ్చి నేర్పించమని పట్టుపట్టారు. తన సమస్య గురించి ధర్మరాజుకు తెలియజేశాడు అర్జునుడు. ఎందుకైనా మంచిది ఒకసారి సహదేవుడిని కలిసి మాట్లాడమని ధర్మరాజు చెప్పాడు. అర్జునుడు సరే అని గోసాల వైపు వెళ్లి చూస్తే సహదేవుడు అప్పటికే గోవులను తోలుకుని అడవికి వెళ్లాడని సాయంత్రానికి తిరిగి వస్తాడని చెప్పారు. సహదేవుడికి వేణువు వాయించడం వస్తుందా? అని అడగడంతో అక్కడున్న వాళ్ళు సహదేవుడి వేణుగానం గురించి చాలా గొప్పగా చెప్పారు. సాయంత్రం వేణువు తీసుకొని సహదేవుని వద్దకు వెళ్ళి తనకు వేణు గానం నేర్పించమని అడిగాడు. అర్జునుడు ఒకసారి వేణువుని నోట్లో పెట్టుకుని వాయించగా విచిత్రమైన శబ్దం వచ్చింది. సహదేవుడు తన వేణువును వాయించగా మధురమైన శబ్దాలు వచ్చాయి. మళ్లీ అర్జునుడు తన వేణువును వాయించగా విచిత్రమైన శబ్దం వచ్చింది. అలాగే సాధన చేయమని సహదేవుడు అర్జునునికి చెప్పాడు. కానీ అర్జునుడు తన దగ్గర ఉన్న వేణువులోనే ఏదో లోపం ఉందని భావించాడు. సహదేవుని వేణు గాన విద్య అంతా అతడిలో ఉందా? అతని వేణువులో ఉందా? అని ఆలోచించి ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చి సహదేవుడి వేణువుని తీసుకెళ్లిపోయాడు. మరుసటి రోజు తెల్లవారి పూస్తే సహదేవుడికి తన వేణువు కనిపించదు. జరిగిందేమిటో అర్థం చేసుకున్న సహదేవుడు నవ్వుకొని కొత్త వేణువుని తయారు చేసుకోవడానికి వెదురు పొదల వైపుకి వెళ్లాడు.

**గంగమ్మ పూలు** :- బోరింగు వేసే సందర్భంలో జరిగే గ్రామీణ సామాజిక భావోద్వేగ జీవన వాస్తవాలను ఇతివృత్తంగా తీసుకుని ఈ కథ రాయబడింది. ఆకాశంలో ఎక్కడ మబ్బులు కనిపించడం లేదు. తాగడానికి నీళ్లు దొరకడం లేదు. నది ఎండిపోయింది. ఒకప్పటి వెండినది ఇప్పుడు ఎండిన నది అయింది. పల్లెలోని నాలుగు బోర్లు ఎండిపోయాయి. అందుకే గ్రామస్తులంతా కలిసి కొత్త బోరు వేయించుకోవాలని నిర్ణయించారు. బోరింగ్ పాయింట్ చెప్పడానికి నాగరాజును పిలిపించారు. నాగరాజు టెంకాయను కుడి అరచేతిలో పట్టుకొని అటూ ఇటూ తిరుగుతూ ఉండగా ఒకచోట టెంకాయ నిటారుగా నిలబడింది. అక్కడ బోరు వేయడం మొదలైంది. ఒకటి కాదు రెండు కాదు మూడువందల అడుగులు లోతు బోరువేసిన నీటి జాడ కనిపించలేదు. రెండవ చోట కూడా అదే పరిస్థితి ఎదురైంది. ఎందుకో గంగమ్మ తల్లి కరుణించలేదని అందరూ వెళ్ళిపోయారు. జాతర జరిపిస్తే వానలు కురుస్తాయని నమ్మకం కాబట్టి అందరూ కలిసి గంగమ్మ తల్లి జాతర చేయాలని నిర్ణయించుకున్నారు. జాతర మొదలైంది. చూడడానికి రెండు కళ్ళు సరిపోవడం లేదు. ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. చినుకు చినుకు రాలుతూ అర్ధరాత్రి కుంభవృష్టి కురిసింది. ఎండిన ఏరు నిండుగా ప్రవహిస్తూ ఉంది. ఇన్నాళ్లు ఎండిపోయిన ఏరులో ఉరకలెత్తుతూ వస్తున్న

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:6(3), June 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

గంగమ్మకు సమర్పించడానికి గ్రామంలోని ఆడవాళ్ళందరూ దోసిల్లతో పూలు తీసుకుని వెళ్లి ఏటిలో ప్రవహించే గంగమ్మకు సమర్పించారు. అలాగే ఏనుగు నల్లరాతి కొండ. కొండ మధ్యలో నల్లరాతి బండ. బండ మధ్యలో గవి. గవిలో ప్రవహిస్తోంది గంగమ్మ. గవి పైన నిలబడి చూస్తే నీటి శబ్దం విన్నవాళ్ళే గానీ చూసినవాళ్లు ఎవ్వరు లేరు. ఇప్పుడు గవిలోని నీళ్లు పైకి ఉబికి వస్తున్నాయని తెలిసి ఆడవాళ్ళందరూ గన్నేరు పూలు దోసిల్లతో తెచ్చి గంగమ్మకు సమర్పిస్తున్నారు.

**ముగింపు** :- "గరుడపచ్చ" కథలో జొన్నగిరి, వజ్రగిరి ప్రాంతాల్లో నాలుగు చిలుకలు రాలితే వజ్రాలు దొరుకుతాయని రచించారు కానీ, వానలకు నోచుకోని రాయలసీమ ప్రాంతానికి దొరికిన నిలువెత్తు వజ్రం డాక్టర్ వేంపల్లి గంగాధర్. రాయలసీమ ఇతిహాసంగా భావించబడిన "గంగమ్మ పూలు" కథా సంకలనం ఒక్కో కథ ఒక్కో చీకటి కోణాన్ని ఆవిష్కరించింది. ఇలాంటి అంశాలను కేవలం గంగాధర్ లాంటి రచయిత మాత్రమే చూడగలరు, చెప్పగలరు, రాయగలరు అనడం అతిశయోక్తి కాదు. గంగమ్మ పూలు లోని కథలు నీటి కొరత, కుల వివక్ష, భూ వివాదాలు, మహిళల పోరాటాలు వంటి సమస్యలను లోతుగా ఆవిష్కరించాయి. రాయలసీమ స్థానికతలోంచి పుట్టిన ఈ కథల్లో రాయలసీమ రోడ్లు, సంతలు, గ్రామాలు, రైల్వే స్టేషన్లు, పొలాలు, అడవులు, కొండలు , సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, జాతరలు భావోద్వేగాలు, సామాజిక స్థితిగతులు, పేదరికం, నిస్సహాయత, దౌర్జన్యాలు, కొన్ని రకాల వృత్తులు కనిపించాయి. వ్యధ, వేదన, వాడిన ఆశలు, కలతప్పిన జీవితాలు కనిపించాయి. ఎంతటి వ్యధా భరిత జీవితాలైనా ఆయా పాత్రలు తమ జీవితాలను ముగించడం కాకుండా మరో రకంగా ముందుకు నడిచే దిశగా పాత్రలను చిత్రించడం రచయితలోని ఆశావాదానికి నిదర్శనం. ఈ సంకలనంలోని కొన్ని కథలలో ఒక ప్రత్యేకత ఉంది. రచయిత కథలను ఏ వాక్యాలతో ప్రారంభించారు అదే వాక్యాలను కాస్త మార్చి కథలను ముగించారు. ఈ కథల ద్వారా ప్రాంతీయ అంశాలను విశ్వవ్యాప్తం చేసి డాక్టర్ వేంపల్లి గంగాధర్ గారు రాయలసీమ సామాజిక సాంస్కృతిక స్వరూపాన్ని చరిత్రలో నిలబెట్టారు.

**ఆధార గ్రంథాలు** :-

1. కథా శిల్పం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య
2. కథానిక స్వరూప స్వభావాలు – పోరంకి దక్షిణామూర్తి
3. తెలుగు కథలు – కథన రీతులు – సింగమనేని నారాయణ
4. తెలుగు కథ వికాసం – పాలగుమ్మి పద్మరాజు
5. తెలుగు కథ నాడు, నేడు – కోడూరు శ్రీరామమూర్తి
6. గంగమ్మ పూలు కథలు – వేంపల్లి గంగాధర్